# అక్షయపాత్ర

**కథ**

**గుండెలవిసిపోయేలా గావుకేక పెట్టాడు విమలా వాళ్లాయన కమల్నాభం. అదిరి పడ్డ విమల ఆ కేక అంట్ల బాల్కనీ లోంచి వచ్చిందని అర క్షణంలో గ్రహించి అటు పరిగెత్తింది. వాళ్ల ఫిఫ్త్ ఫ్లోర్ బాల్కనీలో అంట్ల కుప్పకి, చెత్తడబ్బాకి మధ్యలో నిలబడున్నాడు కమల్నాభం. విమలని చూడగానే "య్యేవిటిది? య్యేవిటి? య్యేవిటి?" అని అరిచాడు, కుడిచేతి చూపుడు వేలుని పిడిబాకులా చాచి చెత్తడబ్బాలోకి చూపిస్తూ.**

విమల గుండె గుభేలుమంది. ఇప్పుడే తను చూసిన సీరియల్లోలా పెళ్లికాని తల్లెవరైనా పసిగుడ్డుని ఆ డబ్బాలో పడేసిందేమోనని అనుమానంతో విలవిలలాడింది. ''పసిగుడ్డా?'' ఆత్రంగా అరిచింది.

''గుడ్డా? నువ్వు గుడ్లు కూడా వండుకు తింటావా? మీరంతా ప్యూర్ వెజిటేరియన్లని చెప్పిందే పెళ్లిచూపుల్నాడు మీ అమ్మ?'' కొరకొరా చూసాడు కమల్నాభం.

''మతిగానీ పోయిందా? ఏవిటా అసందర్భ ప్రేలాపన?''

''నాదా నీదా అసందర్భం? నేను అన్నం గురించడుగుతుంటే గుడ్డు గుడ్డంటూ పేలింది నువ్వు కాదూ?''

''పూర్తిగా పోయినట్టే ఉంది ఆ వున్న కాస్త మతీ. అంట్ల గిన్నెల దగ్గర నిలబడి అన్నం పెట్టమంటారేమిటీ అసహ్యంగా? ఇలా లోపలికి రండి డైనింగు టేబుల్ దగ్గరికి. పెడతాను''

''నాక్కాదు పోయింది నీకూ! డబ్బాలో అన్నం గురించడుగుతుంటే పెడతాను తినమంటావేమిటి? తిండి తప్ప మరో ఆలోచనొచ్చిందా ఏనాడయినా ఆ మెదడులోకి?''

''ముప్ఫయ్యేళ్లనాటి పెళ్లిచూపులు గుర్తొస్తాయి! డబ్బాలో అన్నం అంటారు. ఎవరికి మతిపోయిందన్నమాటా? పైగా నాది తిండిపోతుతనం! హు! గంట గంటకీ ఇది చేసి పెట్టూ, అది వేయించి పెట్టూ అంటూ నా మెదడులోకి మరో ఆలోచన రానీయకుండా మెదడంతా తిండి మయం చేసింది మీరు కాదూ?'' నిలదీసింది విమల. మాటా మాటా వచ్చినప్పుడు పై మాట తనది కాకపోతే ఆవిడకి నిద్రపట్టిచావదు.

''ఇంక నీ దండకం ఆపి ఇలా వచ్చి డబ్బాలోకి తొంగి చూడు. నేనేవంటున్నానో నీకే అర్థం అవుతుంది. మాటల్తో చెప్తూంటే ఎలాగూ అవదు'' అన్నాడు కమల్నాభం గుర్రుగా చూస్తూ.

ఎర్రగా చూస్తూ రెండడుగులు ముందుకేసి డబ్బాలోకి తొంగిచూసింది విమల. తెల్లటి మల్లె మొగ్గల రాసిలా వున్న అన్నపు రాసి కనిపించింది డబ్బాలో. పసిగుడ్డుని పారేసినంత బాధా కలిగింది విమలకి.

''నేను కాదండీ, అర్చన'' అంది గద్గద స్వరంతో.

''అర్చనెవరు?'' అనుమానంగా అడిగాడు కమల్నాభం.

''అదేనండీ మన పనమ్మాయి. ఆ పిల్ల పేరు అర్చన''

''అర్చనో హారతిపళ్లెమో ఎవరయితేనేం? కేజీ ఇరవయ్యీ పాతికా పోసి నేను కొనుక్కొస్తుంటే మీరిలా వండేసి చెత్తడబ్బాల్లో పోస్తున్నారు. బాధ్యత లేదూ?'' ఆవిడ తగ్గింది కదాని ఈయన కేకలేసాడు రెచ్చిపోయి.

''బావుంది. నన్నంటారేం? అసల్దీనంతకీ మీరే కారణం'' ఈవిడ పుంజుకుని గొంతు పెంచింది.

''అవును మరే. అన్నిటికీ నేనే కారణం. నేను పుట్టడం వల్ల నిన్ను పెళ్లాడ్డం వల్ల ఇవాళిలా అన్నం పారేసుకోవాల్సి వచ్చింది. బావుంది మహా బావుంది''

''అవును మరీ.. నిన్న చెప్పా పెట్టకుండా ఫ్రెండ్సు ఫ్రెండ్సని చెప్పి ఓ పటాలాన్ని భోజనాలకి తీసుకొచ్చారాయె. చేతులు పడిపోయేలా వంట ల్చేసి వడ్డించి ఇదుగో ఇవాళిలా మాటలు పడుతున్నా''

''నీకెలాగూ ఓ ఫ్రెండూ చట్టుబండలూ లేరు. నాకున్నారని కుళ్లొహటి! ఎవరైనా భోజనానికొస్తే మాత్రం ఇలా కుంభాలొండేసి పారబోసుకుంటారా?''

''బావుంది. తీరా భోజనాలకు్కూర్చున్నాక అన్నం తక్కువైందంటే పోయేది మీ పరువే. ఆమాత్రం ఎక్స్‌ట్రా ఏ ఇల్లాలైనా వండుతుంది. అయినా పారేసింది నేను కాదంటే వినరేం? ఆ పని పిల్ల''

''ఎవరైతే ఏం? నేను సంపాదించనూ మీరు చెత్తలో పారెయ్యనూ'' ధుమధుమలాడుకుంటూ వెళ్లి పేపర్లో మాయమయ్యాడు కమల్నాభం.

అప్పటికి ఆ రకంగా మాటల పోరాటానికి ఫుల్ స్టాప్ పడి వాతావరణం చల్లబడింది. విమల అక్కడే నిలబడి కూల్‌గా ఆలోచించింది. ''డబ్బులకేమొస్తాదమ్మా ఈరోజుల్లో! అంత అన్నం బెట్టు నీ పేరు చెప్పుకు తింటా. నీ ఇంట్లో పడుంటా'' అనే పాతకాలం పనివాళ్లు రిటైరైపోయారు-పోయారు. సినిమా ఫీల్డులో వచ్చినట్టే ''థరో ప్రొఫెషనల్స్'' ఈ ఫీల్డులోకి కూడా వచ్చేసారు. వీళ్లు మిగిలిన అన్నాలకీ టీ టిఫిన్లకీ ఆటే ఇంపార్టెన్స్ ఇవ్వరు. పనికింత, గంటకింత అంటూ కాలము, పని కాల్క్యులేషన్స్ చేసి క్యాష్ మాత్రమే తీసుకుంటున్నారు. గుడ్. అంతా మన మంచికే. సరే. పనివాళ్ల పాలసీలు మారుస్తుంటే యాజమాన్య పద్ధతులు అంటే మేనేజ్‌మెంట్ టెక్నిక్స్ కూడా మారాలి కదా! అప్పుడే ప్రొడక్షన్‌లో వేస్టేజి తగ్గించడానికి వీలవుతుంది. దానికి విమల ఓ పథకం ఆలోచించింది.

ఆ రాత్రి అనుకోకుండా విమల కుటుంబ సభ్యులు (కు.స.) అందరూ ఒకేసారి భోజనానికి కూర్చున్నారు. విమల సమస్య కు.స.ముందుంచింది.

''ఇంక నుంచీ అన్నం కటాకటి వండబడుతుంది. నాకు తెలుసు మన అవసరాలకి ఎగ్జాక్ట్‌గా ఎంతన్నం వండాలో. కాకపోతే ఆఖర్న తినేవాళ్లకి ఏ పెరుగులోకో కాస్తన్నం తక్కువయ్యే పరిస్థితి వచ్చినా ఇబ్బంది పడక్కర్లేదు. స్టాండ్ బై కింద ఒక బ్రెడ్డూ, అరటి పళ్లూ ఎప్పటికీ ఇంట్లో వుంటాయి. ఎవరూ అర్ధాకలితో పడుకోనక్కర్లేదు.'' కు.స. అందరూ బుర్రలూపి అంగీకరించారు.

''ఎందరో నిరుపేదలు ఒక్కపూటక్కూడా సరైన తిండికి లేక మాడుతుంటే మన పనిమనిషి అన్నం చెత్త డబ్బాలో పారెయ్యడాన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. ఇక నుంచి మనందరం నిరతాన్న పొదుపు పథకం వేసుకుని అన్నం పొదుపుకై, అన్న రక్షణకై కృషి చేద్దాం'' ఉద్వేగంగా ఉపన్యసించాడు విమల చిన్న కొడుకు.


''కృషికి నా వంతుగా నేనసలు అన్నం తినడమే మానేస్తాను'' పెద్ద కొడుకు ఉద్ఘాటించాడు. విమల పులుసు గరిట ఝుళిపించేసరికి ఇద్దరూ మాయ

మయ్యారు.

మరుక్షణం-''ఛుష్ష్ష్..'' మను కుంటూ కుక్కరు కూసింది.

మొహాన్ని ప్రశ్నార్థకంగా మార్చి పెద్దాడి పెళ్లాం అంటే తన కోడలి వైపు చూసింది విమల. ''అందరం ఒకేసారి భోజనానికూర్చుంటున్నాం కదా కబుర్లు చెప్పుకుంటూ ఓ ముద్దెక్కువ తిన్నా ఇబ్బంది పడకూడదని నేనే ఓ గ్లాసుడు బియ్యం కుక్కరో...'' సణి గింది కోడలు కళ్లు కాళ్ల వేళ్ల మీదకి తిప్పి, బుర్ర భూమిలోకెలా దించె య్యాలా అని ప్లానేస్తున్న దానికి మళ్లే వొంగిపోయి కుంగిపోతూ.

టపటపమని ఆ పిల్ల నెత్తిన మొట్టె య్యాలన్నంత ఆవేశం ముంచు కొచ్చేసింది విమలకి. కొడుకైతే మొట్టేసేదే.



ఈ పిల్ల కోడలైపోయిందే! మరంచేత సంభాళించుకుని ''సరే. జరిగిందేదో జరిగింది. ఇక ముందు జరగకూడదిలా. నన్ను కన్సల్ట్ చేయకుండా కప్పుడు బియ్యం కూడా కుక్కరు కెక్కకూడదు'' గంభీరంగా ఆర్డినెన్సు జారీ చేసింది.

మర్నాడు పొద్దున్న కు.స.లందరూ డైనింగ్ టేబుల్ చుట్టూ చేరి ఘుమఘుమలాడుతున్న పులి హోరని పొగుడ్తూ బ్రేక్‌ఫాస్ట్ లాగించేస్తుంటే వంటింటి గుమ్మంలో నిలబడి గర్వంగా నిట్టూ ర్చింది విమల.

''సో.. ఇది నిరతాన్న పొదుపు పథకంలో మొదటి విడత జన్మభూమి అన్నమాట'' అన్నాడు చిన్నవాడు. అంటే అన్నాడుగానీ మెతుకు మిగలకుండా ప్లేటు క్లీన్ చేసాడు.

''ఏదో పండగనాడో ఎవరింటికైనా భోజనానికెళ్లి నప్పుడో తినే పులిహోర ఇలా బ్రేక్‌ఫాస్ట్‌గా తినడం గొప్ప నావెల్టీగా వుంది'' అన్నాడు పెద్దవాడు.

''అంటే పండగలప్పుడూ, ఇంకోళ్ళిళ్ళల్లో భోజ నాల్చేసినప్పుడూ కూడా ఇదే పథకంలో రాత్రి అన్నం పొద్దున్న పులి హోరావతారం ఎత్తు తుంటుందా?'' అన్నాడు నంబర్రెండు డిటెక్టివులా అనుమానప డిపోతూ.

''ఏదేమైనా ఇలా పుల్లటి పులిహోరలో చల్లటి ఫ్రిజ్ పెరుగు కలిపి తింటుంటే...'' పరవశంగా అంటున్న తండ్రి మాటని, ''ఇహ ఆఫీసుకెళ్లి గుర్రెట్టి నిద్దరో వడమే'' అని ముగించారు కొడుకులిద్దరూ జాయింటుగా.

మధ్యాహ్నం భోజనాల కోసం వంటపూర్తి చేసి వంటింటి గుమ్మం ముందు కుర్చీ వేసుకూర్చుంది విమల. బహూరాణీకి మళ్లీ కుక్కరెక్కించా లన్న కోరికెక్కడ పుట్టుకొస్తుందోనన్న భయం కొద్దీ.

ఎవరి వీలును బట్టీ వాళ్లు ఒక్కొక్కళ్లూ లంచ్ కొచ్చి తినేసి వెళ్లిపోయాక అత్తాకోడళ్లిద్దరూ స్టాక్ వెరిఫికేషన్ చేసారు. మిగుళ్లూ తగుళ్లూ నోట్ చేసు కుని రాత్రి కుక్కర్‌లో ఎంత బియ్యం పెట్టాలో కాలిక్యులేషన్ చేసింది విమల. ''అనుకున్న దానికి ఒక్క వడ్లగింజ కూడా ఎక్కువ పెట్టకూడద మ్మాయ్'' కోడలికి వార్నింగిచ్చింది చీఫ్ ఎగ్జిక్యూ టివ్ లెవెల్లో. అసిస్టెంటు బుద్ధిగా బుర్రూపింది.

తండ్రీ కొడుకుల ఆఫీసులు మరీ కూతవేటు దూరంలో కాకపోయినా, కారువేటు స్కూటరు వేటు దూరాల్లో మాత్రమే వుండడం వల్ల మధ్యాహ్న భోజనాలకే కాక సాయంత్రం కాఫీ టిఫిన్లకీ కూడా ఇంటికిట్టే వచ్చేస్తారు. సరే మరందుకోసం సాయంత్రం స్నాక్స్ కూడా పెర్ఫెక్ట్‌గా లెక్కప్రకారం తయారుచేసింది విమల, తన గణిత శాస్త్ర పాకశాస్త్ర పరిజ్ఞానా లన్నీ సమ్మిళితం చేసి.

చిన్న ముక్క కూడా వేస్టవకుండా చేసిన టిఫి నంతా ఆరగించబడింది. కోడలి వైపు గర్వంగా చూసింది విమల ఖాళీ ప్లేట్లు సింకులో వేస్తూ. ఆ పిల్ల తన వైపు ఎడ్మయిరింగ్‌గా చూసిందో లేదో విమల చూడలేదు- ఎందుకైనా మంచిదని.


రాత్రి లెక్క ప్రకారం కుక్కరు పెట్టారు. దించారు. లెక్క ప్రకారమే ముక్కలు తరిగారు వేయించారు. తీరా భోజనాల టైముకే లెక్క అడ్డంగా పక్కకి తిరిగిపోయింది.

సాయంత్రం టిఫిన్లయ్యాక చిన్నవాడు తిన్నగా ఉండక తిన్నదరిగే వరకూ తిరగడానికి పోయాడు. ఉత్తచేతుల్తో పోయినవాడు పోయినట్టే తిరిగిరాక చేతుల్నిండా ఇంత పెద్ద అట్టపెట్టెల్తో వచ్చాడు.

పోడూరి కృష్ణకుమారి

''మా ఫ్రెండొకడు మన వీధి చివర పాకలు పీకించేసి ఆ స్థలంలో 'పిజ్జా గుడిసె' పెట్టబోతున్నాడని చెప్పాకదా. పెట్టాడు. ఆ పిజ్జాగుడిసెకి నాచేత రిబ్బను కత్తిరింపించి బోణీ కొట్టించాడు.'' అని చెప్పాడు పిజ్జా అంత మొహం చేసుకుని.

''ఇది గార్డెన్ పిజ్జా, ఇది ప్యాలెస్ పిజ్జా. ఇది కింగూ. ఇది వైకింగూ.. ఎట్సెట్రా ఎట్సెట్రా...'' అంటూ ఆరు రకాల పిజ్జాలు పరిచాడు. వయసుతో నిమిత్తం లేకుండా అందరూ అన్ని రకాల పిజ్జాలూ అన్ని కోణాల్లోంచీ విరుచుకుని ఆరగించారు. తినకపోతే మిగతా వాళ్లు నొచ్చుకుంటారేమోనన్న అనుమానంతో విమల కూడా తినేసింది.




భోజనాల టైములో పిజ్జాల్తో బొజ్జలు నింపుకున్నారు. ఆవలింతలు ముంచుకొచ్చేవేళ అదేదో డ్యూటీ లాగా భోజనాలకొచ్చారు. ఓ పనైపోతుందన్నట్టు కంచాల్లో కెలికేసి గుర్రెట్టడానికి ఎవరి గదుల్లోకి వాళ్ళెళ్లిపోయారు. బల్లమీది 'లెఫ్టో వర్లు' తనిఖీ చేసి ఏవేవి ఫ్రిజ్‌లో పెట్టాలో ఏవి అంట్లలో వేసెయ్యాలో కోడలికి ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చేసి విమల కూడా ముసుగు తన్నేసింది.

కరివేపాకు, జీడిపప్పు పోపుతో ఘుమఘుమలాడుతూ పచ్చలు, కెంపులూ పొదిగిన మేలిమి బంగారపు రాసిలా మెరిసిపోతున్న పులిహోరని చెత్తడబ్బా నిండా నింపి, డైనింగ్ టేబుల్ మీద పెట్టినట్టు భయంకరమైన పీడకలొచ్చి గబుక్కున మేల్కొంది విమల. అప్పటికే లోకంలో కోళ్లన్నీ కూస్తున్నాయి.

ఫ్రిజ్‌లోంచి అన్నం గిన్నె తీసి కుక్కర్‌లో స్టీమింగ్ చేసి స్టెరిలైజ్ చేసింది విమల. వెరైటీ కోసం చింతపండు కాక నిమ్మరసంతో పులిహోర చేసి బ్రేక్‌ఫాస్ట్ గంట మోగించింది.

''రెండో విడత జన్మభూమి'' ఎనౌన్స్ చేసాడు చిన్నవాడు.

''దీన్ని చిత్తూరు జిల్లాలో చిత్రాన్నం అంటారు'' తన జి.కె. ప్రదర్శించాడు తండ్రి.

పెద్దవాడు మౌనం వహించాడు.

దీనంగా మొహాలు పెట్టుకుని మొత్తానికందరూ అయిందనిపించారు.

మగాళ్లు ముగ్గురూ ఎందుకోగానీ చాలా సీరియస్‌గా పెద్దవాడి రూంలో సమావేశమయ్యారు. తలుపులు బిడాయించారు. శాండ్‌విచ్ టోస్టర్ పనిచేస్తున్నట్టుగా కమ్మటి వాసన మూసిన తలుపుల్లోంచి అలా అలా తేలి వచ్చి విమల ముక్కుని సుతారంగా తాకింది. సుదీర్ఘంగా నిట్టూర్చింది విమల.

అంట్లు తోమే అర్చన రాగానే టెస్ట్ డోస్ లాగా కొంచెం పులిహోర కటోరీలో పెట్టి ఆఫర్ చేసింది విమల. తనతో తెచ్చుకున్న స్టీలు డబ్బా మూత తీసి పులిహోరని పదిలంగా అందులో పెట్టుకుంది అర్చన. ''యాహూ!'' ఆనందపడింది విమల మనసు.

అన్నాన్ని అన్నంలాగే గిన్నెలో పెట్టిస్తే దాన్ని చెత్తడబ్బాలో పారేస్తుంది కానీ దానికే పులిహోర మేకప్పు వేస్తే స్వీకరిస్తుందన్నమాట!

''ఆల్‌రైట్ అర్చనా! నౌ ఐనో యువర్ సీక్రెట్'' సంతోషంగా అనుకుంది విమల.

ఆరోజు రాత్రి తంటాలుపడి వంటంతా ముగించాక పెద్దకొడుకొచ్చి ''హఠాత్తుగా ఫ్రెండొకడు పార్టీ ఎరేంజ్ చేసి పిలిచాడు. మేం వెళ్లాలి'' అంటూ పెళ్లాన్ని స్కూటరు మీదెక్కించుకుని ఉడాయించాడు. ''ఏం నాయనా! నీక్కూడా ఉన్నట్టుండి చిన్నప్పటి ఫ్రెండొడిపడి ఏదైనా పార్టీకి పిలిచాడా?'' అంది విమల చిన్న కొడుకుతో. మిగలబోతున్న అన్నం తలుచుకుంటే ఒళ్లు మండిపోతోంది ఆవిడికి.

చిన్న వంశోద్ధారకుడు సిట్యుయేషనంతా ఓసారి సింహావలోకనం చేస్తున్నవాడిలా కాసేపు ఆలోచించాడు. ''ఆల్‌రైట్.. ఇవాళ రాత్రికి నేను నా వాటా అన్నం తినేస్తే- ఐ మీన్ ఇంట్లోనే భోంచేస్తే రేపు పొద్దున్న పులిహోర బ్రేక్‌ఫాస్ట్ తినక్కర్లేదని హామీ ఇస్తావా? ఇస్తే భోంచేస్తా'' అన్నాడు రాటుదేలిన బ్లాక్‌మెయిలర్ లాగా.

పిచ్చి కోపమొచ్చి విమలకి నోట మాటే రాలేదు.

మర్నాడు పొద్దున్న కూడా అన్నపొదుపు కార్యక్రమం మొండిగా సాగించింది విమల చద్దన్నానికి పులిహోర వేషం వేసి. పురుషులు ముగ్గురూ ''ఇవాళ తొందరగా వెళ్లాలి. ఆఫీసులో చాలా పనుంది'' అన్న డైలాగు కొట్టి రోజూ కన్నా గంట ముందే వెళ్లిపోయారు. అత్తాకోడలూ తిన్నంత పులిహోర తిని మిగతాది అర్చనకిచ్చారు. మరో రెండ్రోజులలాగే ఎవరి పంతాలు వాళ్లు కొనసాగించారు.

## గొప్ప మార్పు

**పరిస్థితులకి తగ్గట్టుగా మనం కూడా మారుతుంటాం. 'మఖ్బూల్' చిత్రం తనకి మంచి పేరు తేగలదంటోంది మల్లికా షెరావత్. ఈ చిత్రం ప్రీమియర్‌లో ఆమెని ఎవరూ గుర్తించకుండా ప్రత్యేక ఏర్పాటు చేసుకుందిట. 'ఇండస్ట్రీలోకొచ్చి నేను కొద్దికాలమే అయినా నాకు ఫాలోయింగ్ బాగా పెరిగింది. ఇండస్ట్రీలో నా ప్రాధాన్యత కూడా ఎక్కువే. అంకితభావం, సరైన ప్రణాళిక ఉంటే సక్సెస్ అంత కష్టం కాదు' అని తెగ అనుభవం ఉన్నదాన్లా చెబుతోంది. కొంతమంది సాన్నిహిత్యం ఇలా మార్చేస్తుంది జనాన్ని.**



మూడోరోజు పొద్దున్నే అర్చన పన్లోకొస్తూ అర కేజీ వేరుశనగ గుళ్ల పేకెట్ విమల చేతిలో పెట్టింది. ''నిన్నా, మొన్నా పులిగోర్లో ఏసెనగ పప్పెయ్యలేదమ్మగోరూ మీరు. ఇంట్లో అయిపోయినాయేటో నన్నెప్పి మనీది సివరి కొట్లోంచట్టుకొచ్చేసినాను'' పేకెట్‌తోపాటు బిల్లు కూడా ఇచ్చింది.

డబ్బులిచ్చేస్తూ పరిస్థితంతా పరిశీలించిందోసారి విమల. ఎంత గీసి గీసి కొలిచి తగ్గించి వండినా తమ ఇంట్లో అన్నం అక్షయ పాత్రతో వండినట్టు ఎంతో కొంత మిగుల్తూనే వుంటుంది. తప్పదు. ఎంతోమంది అన్నార్తులున్న దేశం ఇది. ఏ మాత్రం పాడవని అన్నాన్ని చెత్తడబ్బాలో పారెయ్యడం కన్నా పాపం ఇంకోటి లేదు.

ఆ పాపం నివారించాలంటే రెండే మార్గాలున్నాయి. ఒకటి- డెయిలీ పులిహోర పథకం. రెండు- ఇంట్లో అందరూ తమ భాధ్యత గుర్తించి బయట తిళ్లు, చిరుతిళ్లు మాని ఇంట్లోనే ప్రతిపూటా భోంచేయాలి. రెండోది దాదాపు అసాధ్యం. మొదటిదే బెస్టు. కాకపోతే చింతపండు ఖర్చు కాస్త ఎక్కువవుతుంది. మరేం పర్వాలేదు, ఆమాత్రం భరించవచ్చు. కడుపు నింపాల్సిన అన్నం కచడా డబ్బాలోకి వెళ్లకుండా అడ్డుకోడమే లక్ష్యం.

ఇంక పరిష్కరించాల్సిన సమస్యల్లా ఇంట్లో మగాళ్లు బ్రహ్మచారుల్లా, అనాథల్లా.. కాదు కాదు అపత్నుల్లా హోటల్ ప్రదక్షిణాలు చెయ్యడం. ఇదెలా సాల్వ్ చెయ్యడం? ఎస్.కె. దరిద్రాలకి ఎ.కె.ఉపాయాలన్నాడో మహానుభావుడు. ఏదో ఓ సొల్యూషన్ దొరక్కపోదు. ఆరోజు రాత్రి తీవ్రంగా ఆలోచిస్తూ పడుకుంది విమల.

పొద్దున్నే బ్రేక్ ఫాస్ట్ టేబుల్ మీద పులిహోర బేసిన్ పక్కనే పూరీ కూరా డిష్‌లు చూసి ''ఆహా! ఫైవ్‌స్టార్ హోటల్లో జన్మభూమి జరుపుకున్నంత ఆనందంగా వుంది'' అన్నాడు చిన్నాడు. పులిహోర మొహం చూడకుండా పూరీలే పూర్తి చేసారు పురుషపుంగవులు ముగ్గురూ.

ఇంక రోజూ అదే పద్ధతి కొనసాగించింది విమల. పులిహోర-ఇడ్లీ సాంబార్, పులిహోర-ఉప్మా, పులిహోర-దోసెలు, పులిహోర-బ్రెడ్ టోస్టూ.. ఇలా సాగాయి విమలింట్లో బ్రేక్‌ఫాస్ట్ మెనూలు.

''అందరిళ్లల్లోనూ అన్నం కాన్‌స్టెంటూ, కూరలూ పచ్చళ్లూ వేరియబుల్స్. మనింట్లో బ్రేక్‌ఫాస్ట్‌లో పులిహోర కాన్‌స్టంటూ'' అన్నాడోనాడు చిన్నాడు మహామేధావిలా. తాటికాయలా తల తాటించాడు పెద్దాడు.

''మనింట్లోనూ భోజనంలో అన్నం కాన్‌స్టెంటే. కాకపోతే మీకందరికీ అన్నం టైములో అన్నం కాక అన్నీ తినే అలవాటుండడం వల్లనే ఈ తిప్పలు'' అంది విమల ఒళ్లు మండిపోతుండగా.

''పోనీ అసలు రాత్రిళ్లు అన్నం వండడం మానెయ్యండి. అందరం పుల్కాల్తిందాం'' అన్నాడు పెద్దాడ్నీ చిన్నాడ్నీకన్న తండ్రి మేధావి.

కెవ్వు కెవ్వున కేకలు పెట్టారు విమల, కోడలు. 'ఇంత మందికీ పుల్కాలంటే ఇంక వంటంటే విరక్తి పుట్టుకొచ్చేంత సమయం వంటింట్లోనే గడిచిపోతుంది. ఏదో దేవుడు కరుణించి ఉత్తరంలో కాకుండా దక్షిణం భారత దేశంలో అదీ అన్నం తినే ఆంధ్ర దేశంలో పుట్టించాడు. పిండి కలపనూ, వత్తనూ, కాల్చనూ గంటల తరబడీ స్టవ్ దగ్గర నుంచోనక్కర్లేని వరం దేవుడిస్తే ఈ పుల్కాల తయారీ ఎందుకు? స్త్రీలకు మాత్రం హాబీలుండవా? అప్పుడప్పుడైనా వీధిమొహం చూడాలనిపించదా? జీవితమంతా జీవితాంతం రొట్టెలొత్తుకుంటూ వంటింట్లో పడుండాలా?' ఇన్ని మాటలు విమల, కోడలు అనలేదుగానీ వాళ్లు పెట్టిన కేకల్లో అన్ని భావాలూ పలికాయి.

కమల్నాభం అత్తాకోడళ్లు పెట్టిన కేకలకు దడుచుకున్న వాడై అస్త్ర సన్యాసం చేసి చెయ్యి కడుక్కుని చక్కాపోయాడు. విమల ఆట్టే చలించలేదు. వీళ్లు పులిహోర తిన్నా తినకపోయినా అర్చన ఉండనే ఉంది. హాయిగా తింటుంది. భయం నాస్తి.

అలలేవీ లేని నిర్మల నిశ్చల సరోవరం లాగా పొద్దున్న ఫలహార కార్యక్రమాలు పులిహోర సమేతంగా నెలరోజులు గడిచిపోయాయి. విమల మనసు కూడా నిర్మల నిశ్చల సరోవరం లాగా ప్రశాంతంగా ఉందీ నెలరోజులూ అన్నం వేస్టవలేదన్న నిశ్చింతతో.

ఒకటో తారీకు వయ్యారంగా వచ్చింది. అంతకంటే వయ్యారంగా అర్చనొచ్చింది. పని చేసింది. వెళ్లింది. వంట చేస్తూ విమల కూరగాయల తొక్కలు పడెయ్యడానికి బాల్కనీలోకెళ్లి పడెయ్యబోతూ చెత్తడబ్బాలోకి తొంగి చూసింది.

అచ్చం తనకొచ్చిన కలలోలాగే పచ్చలు, కెంపులు, పొదిగిన మేలిమి బంగారపు రాసిలా మిలమిలా మెరుస్తున్న పులిహోర ఆ డబ్బాలో దర్శనమిచ్చింది. 'కల నిజమాయెగా' అని పాడుకునే సందర్భం కాదాయె. ''యూ టూ అర్చనా? నువ్వూ ఎదురు తిరిగావా?'' కుంగిపోయింది విమల మనసు. ''ఇప్పుడేమిటి తక్షణ కర్తవ్యం?'' తీవ్రంగా ఆలోచించింది. మర్నాడు పాలబ్బాయితో ''మరో అర లీటరు పాలెక్కువ తీసుకుంటాం రేపట్నించి'' అని చెప్పింది.

ఆ మర్నాడు బ్రేక్‌ఫాస్ట్ టేబుల్ మీద కరివేపాకు, కొత్తిమీరలతో ఘుమఘుమలాడుతున్న దధ్యోజనం అని పిలవబడే పెరుగన్నం ప్రత్యక్షమైంది.

తన అంబులపొదిలో సమ్మోహనాస్త్రంగా బిసిబెళబాత్ మసాలా ప్యాకెట్‌ని కూడా రెడీ చేసి పెట్టుకుంది విమల, అవసరమైనప్పుడు సంధించి వదలడానికి.

## దురుసుతనం

శిల్పా ఈమధ్య పాత్రికేయులపై విరుచుకుపడుతోంది. 'గర్వ్' సినిమా షూటింగ్ సందర్భంగా ఆమెతో మాట్లాడడానికి వెళ్ళిన పాత్రికేయుల్ని ఆమె చెడామడా తిట్టేసిందట. ఇంతకీ సంగతేంటంటే సల్మాన్‌ఖాన్ గురించి ఎవరూ పట్టించుకోకపోవడమే ఆమె కోపానికి కారణమంట. 'ఆయన నటిస్తున్న సినిమాలు బాగా హిట్ అవుతున్నాయి. అయినా ఆయన గురించి రాయడం లేదు'అంటూ కోపగించుకుందిట. దీంతో సదరు మీడియా జనం ముక్కున వేలేసుకున్నారట.

